# చెల్లని నోటు

రచన:

## 'సులోచన'

వెంకటేశ్వర్లు ఎందుకూ కొరగాకుండా పోతున్నాడు, అటు భార్యకి ద్రోహం చేస్తున్నాడు, ఇటు అంతో ఇంతో వంశానికి అప్రతిష్ఠని తెస్తున్నాడు. మధ్యన నల్చుకుపోయే ధనం నల్చుకుపోతూనే వున్నది; ఎటు తిరిగీ మనిషి చెడిపోతున్నాడు అని తెలుసుకొన్న వెంకట్రామయ్య ఒకరోజు అన్నాడు, తమ్ముడితో.

'ఏరా! ఇప్పుడు నువ్వే స్థితిలో వున్నావో తెల్సుకోగలుగుతున్నావా? కాస్తంత ఆస్తి వున్నదా లెక్క? నీపాటి ఆస్తి ఎంతమందికి లేదు ఈ దేశంలో! అది గాదు విషయం. ఆ ఆస్తిని తరగకుండా చూసుకోవటమే గొప్ప. అంతకు మించి నాశనం చేయటంలో పేరు ప్రతిష్ఠలు రావు. ఇప్పటి పరిస్థితుల్లో ప్రతి ఒక్క మనిషీ ఉన్నదాన్ని యేదో వేషంతో, దృక్పథంతో, మోసంతో రెండింతలు చేసుకోవటాన్నే ముఖ్యవిధిగా భావిస్తున్నాడు. దీన్నిబట్టిగూడా మనం స్వవిషయాల సమస్యల్ని ఒకళ్ల కళ్లల్లో పడకుండా చక్కబెట్టుకోవాలి.

'అదొకటున్నా, మన పేమున్నా ఈ వూళ్లో పేరు తెచ్చుకోలేము. ఉన్న పేరు ఎలానూ తండ్రిమూలంగా వుండనేవున్నది. దాన్ని కాస్త అడ్డమైన పనులుచేసి చెడగొట్టుకోవటం దేనికి?

'ఇక పోతే ప్రస్తుత పరిస్థితుల్లో నిన్ను నువ్వు చదువుకో, అర్థం చేసుకో. ఊరినిండా బాకీలే. మూడు ఎకరాలకి సరిపోనున్నవి. వాళ్లుమట్టుకు ఎన్నాళ్లిస్తారు అప్పు? పొలానికి సరిపోనిస్తారు; ఆ తరువాత నీ మొహం చూడరు. నీ అవసరాన్ని వాళ్ళ అవసరాలుగా భావించుకోలేరు. బ్రతుకు కాస్తా బజారుపాలు అవుతుంది. మనహయాములో మనం అగౌరవానికి గురవ్వటమే కాకుండా తండ్రికి చెడ్డపేరు తెచ్చినవాళ్ళం అవుతాము.

'నీ భార్య సంగతి మాడు, ఎలా అయిందో! అదంతా నీగురించి దిగులే, నీ గురించి ఆలోచనే. నిజానికి ఆమె ఈ రోజుల్లో వుండవలసింది కాకపోబట్టి నిన్ను అంటిపెట్టుకొని వుంది గాని, ఏ ఆడది వుంటుందిరా? నువ్వనే మాటలకూ, తిట్టకూ-తన్నే తన్నులకూ! ఇంతకీ అది తన గీత మంచిది కాదనుకొనే తృప్తిపడుతున్నది. నీ కొక ఆడపిల్ల వున్నది. ఎనిమిదేళ్ళది. ఆడపిల్లల పెళ్ళి చేయటమే తేలని సమస్యగా పరిణమించిన ఈ రోజుల్లో, పిల్ల తండ్రివైన నువ్వు - ఇలా వక్రమార్గంలోపడి అందరిలో 'న్యూనత'గా వుంటే ఇంక దాన్ని పెళ్లాడటానికి ముందరకొచ్చే మొగాడెవడుంటాడు? పెళ్ళి ఎలా చేయగలుగుతావు?

'నేను నిన్ను డబ్బు ఖర్చు చేసుకోవద్దనిగాదు చెప్పేది. ఆ ఖర్చయినా అవసరమైనవాటికే నలుగురికీ ఉపయుక్తంగా ఉండేనవసరం లేకపోయినా కుటుంబానికి పనికివొచ్చేదైతే సరి. భార్యను వొదిలి ముండలకి డబ్బు తగలబెట్టడం మంచిపనిగాదు. నలుగురూ మెచ్చేది కాదు. కుటుంబం బాగుపడే లక్షణం కాదు.'

ఇటువంటి ఉపన్యాసాలు ఎవ్వరూ ఇంతవరకు వెంకటేశ్వర్లుకి చెప్పలేదని కాదు గాని, ఆ చెప్పినవాళ్లెవరూ ఇంత ఫోర్సుగా, లాలనగా చెప్పలేదు. అయినా అది అనవసరం. ఈ ఉపన్యాసంలోని అంతర్యాన్ని గ్రహించుకొని వక్రమార్గంలోంచి సక్రమమార్గంలోకి అమాంతంగా రాగల శక్తిసామర్థ్యాలు ఇంకా వెంకటేశ్వర్లుకి కలగలేదు గనుక.

వంచిన తల ఎత్తకుండా కూచున్నాడు వెంకటేశ్వర్లు. ఎవరన్నా తననిగురించి, తన క్షేమంగురించి నీతులు చెబుతూంటే 'ఆ చెప్పేది తనకు కాదు' అని అనుకోవటమే, వెదలకుండా కూర్చోవటమే వెంకటేశ్వర్లలోని పెద్ద లోపం. ఆయన్ని తెలియనివాళ్లయితే, ఆయన మనస్తత్వానికి అలవాటుపడనివాళ్లయితే, 'మౌనం అంగీకారసూచకమే! మంచిదోవకు రావొచ్చు' అని భ్రమపడతారు. కాని అది గాదుగా అసలు సంగతి.

లేచి వెళుతూ అన్నాడు, వెంకట్రామయ్య.

'ఇదంతా నాకోసం కాదు. నీవు బాగుపడగలందులకే. కుటుంబంలో కలతలు లేకుండాపోగలందులకే. ఇక, 'నాయిష్టం నాది. నీళ్లల్లో మునుగుతాను, పాలల్లోమునుగుతాను. నువ్వెవరవు చెప్పటానికి' అనేగనుక అంటే, నే చెప్పేదేమీ వుండబోదు. ఇంకా నే చెప్పితే ఆలకిస్తావనే ఆశతోనే చెబుతున్నా. అనవసరపు విలాసాలకు డబ్బును వ్యయపర్చటం జీవితానికి మంచి దెబ్బ!'

వెంకటేశ్వర్లు మాట్లాడలేదు.

ఇది జరిగిన నాలుగోరోజు వెంకటేశ్వర్లు భార్యావొచ్చింది, వెంకట్రామయ్యదగ్గరకు. అప్పుడే అన్నం తిని చుట్ట చుట్టుకుంటున్నాడు.

'ఏమిటే విశేషాలు?' అన్నట్టుచూశాడు.

'ఏమున్నవండి? మీ తమ్ముడుగారికి బాగా గట్టిగా చెప్పండి,' అని నసిగింది.

'చెబుతూనేవున్నాను. చెవినిపెట్టందే! మనమేం చేస్తాం?' ఇక అలాంటప్పుడు తనవల్ల ఎలాగవుతుందనే అర్థం వొచ్చేట్టు అన్నాడు వెంకట్రామయ్య.

'నిన్న నేం జరిగిందో చూశారా?' అన్నది వెంకటేశ్వర్ల భార్య.

'ఏం జరిగిందేమిటి?' అన్నాడు వెంకట్రామయ్య, సగం అసంతృప్తితోనే.

'మీ తమ్ముడుగారు బజార్నుంచి వొస్తున్నారట. ఎవడో అడ్డంమాలిన వెధవ నిలేసి, బూతులవర్షం కురిపించాడట. ఈయనగారు అదిరిపోయి నిలుచున్నారట.'

ఈ విషయం ఎవ్వరూ అనుకున్నట్టు వెంకట్రామయకు తెలీనేలేదు. ఆ పేరోజుకు పదహారు గంటలు బజార్లో తిరిగేమనిషి కాకపోవటంతో తెలీక పోవచ్చు.

'ఎందుకు తిట్టాడు, వాడు?'

'ఎందు కేమిటి? తరువాత తెలిసింది. వాడు దొమ్మరివాడట. ఈయనగారు ఇదివరకట్నుంచి డబ్బులిచ్చి మేపుతున్నారట. ఇప్పుడు యివ్వడం మానేశారుట. వాడిఅప్ప ఈయనగారి ముండట.'

ఇదంతా చెబుతూనే పాపం వెంక

వేంకటేశ్వర్లుభార్య కళ్లనీళ్లు పెట్టుకొంది.

వెంకట్రామయ్యకు ఏమనటానికి తోచ లేదు. 'నే చెప్పిచూస్తానులే. నువ్వేమీ విసుగుపడకు' అనేసి వూరుకున్నాడు.

వెంకటేశ్వర్లు భార్య వెళ్ళిపోయింది.

ఆమె భర్తనుగురించి ఎంతో ఇదవుతున్నది. డబ్బు ఖర్చుపెట్టేవిషయంలో ఆమెకు కష్టపడాల్సిన అవసరంలేదు. రోజూ యింటిదగ్గరుండి, సంసారాన్ని చక్కబెట్టుకొని-నలుగురు పెద్దమనుష్యుల్లో తిరగటమే ఆమెకు కావాల్సింది.

పెళ్లిగాకముందు రాబోయే భర్తను గురించి అందరి యువతులకుమల్లే ఆమె గూడా కలలుకంటే కనొచ్చు. తన జీవితం తేనెసోనగా నడిచిపోతుందని భావిస్తే భావించొచ్చు. తన భర్త తననే ప్రేమదేవతగానూ, తన పిల్లలనే లోకంగానూ చూసుకుంటాడు ప్రేమను వొలకబోస్తూ ఎప్పుడూ తనని అంటిపెట్టుకొని వుంటాడు. అని గూడా అనుకొనివుంటే వుండొచ్చు, కాని ఇలాగే జరుగుతుందని, జరగాలి - లేకపోతే ఆ భర్తను పొందను అని ఆమె ఆశయం కాకపోవచ్చు.

పోతే, తన జీవితం ఇంత అధ్వాన్నం అవుతుందని ఆమె ఎన్నడూ ఊహించలేదని పై భావాల్నిపట్టి తేలుతున్నది. అయినా మనం ఆశ్చర్యపడవలసిన విషయమేమిటంటే, ఇప్పుడామె కోరేది పూర్వపు ఔన్నత్యాన్ని కాదు. పూర్వం తాను కన్న కలలూ,భావించిన భావాలు, నిజాలు గావాలనీ కాదు - తనభర్త చెడు తిరుగుళ్లు తిరగకుండావుంటే సరి. చివరకు తను అక్కర్లేకపోయినా అలాగన్నా కాలేదే, కావటం లేదే. అనే ఇప్పుడు వెంకటేశ్వర్లు భార్య యేడ్చేది, దుఃఖించేది.

భర్త చెడుతిరుగుళ్లు తిరిగి చెడిపోతూంటే భార్యకు దూరమవుతూంటే, ఆ భార్య యేడుస్తుంది. ఈ సమాజంలో, వంశగౌరవాన్నీ, కుటుంబనైసర్గికాన్నీ నిలబెట్టమంటుంది. కాని, ఆ భర్త వినడు; చెవిని బెట్టడు; చెడు తిరుగుళ్ళలోని మధురత్వానికి అలవాటుపడ్డ ఏ భర్తా, భార్యమాట ఆలకించడు. అది ముఖ్యంగా కనబడదు. ఏడుస్తుంది. కాని వినడు. పైగా కొట్టడంగూడా జరిగితే జరగొచ్చు. కొంచం సంస్కారం జీర్ణించిన భార్యయితే 'నే నుండను, నా సుఖం నాది' అని బెదిరిస్తుంది. ఈ బెదిరింపుల్ని భర్తకి బెదిరింపులుగానే కనబడి హేళనలోకి దించుతాయి. బెదిరించినంత మాత్రాన లేచిపోరని తెలుసు. అయితే అతనిలో ఒక గట్టి నమ్మకం అసాధారణంచీ పనిచేస్తూ, ఇప్పుడు గట్టిపడితే పడొచ్చు. 'భార్య భర్తప్రవర్తనాన్ని సహించలేక లేచిపోతే ఆ భార్యని సంఘం మెచ్చదు' అనే నమ్మకం.

వెంకటేశ్వర్లుకి ఈ నమ్మకమే వుండనుకోడం సబబుగాదు.

ఏ మనిషిలోనన్నా గానీయండి, వ్యక్తిత్వం నశించిందంటే వెనుక బలమైన కారణాలుండక తప్పదు. ఆ కారణాలే వెంకటేశ్వర్లులో వ్యక్తిత్వం నశించటానికి సహాయమయ్యాయి. తండ్రి చనిపోతూ యిచ్చినదాంట్లో పంచుకొన్నది వెంకట్రామయ్యా, వెంకటేశ్వర్లే అయినా ముందూ వెనకా ఎవరూ లేకపోబట్టే నాలుగెకరాలు వచ్చినవి. కేవలం ఈనాలుగెకరాలతోనే జీవనం అయితే వెంకటేశ్వర్ల మిడిసిపాటుకు చాలివుండేది కాదు. ఎవడో ఒక ముసలాడు, పది సంవత్సరాలకు చావవలసినవాడు రెండుసంవత్సరాలకే చావటంమూలాన, అదనంగా పది ఎకరాలు వచ్చినవి. ఆ రావటమే వెంకటేశ్వర్లుని ఈ స్థితిలోకి తెచ్చింది. పైగా అత్తగారు నాలుగెకరాల కట్నం, రెండువేల డబ్బు - ఇచ్చారు.

'అదృష్టంకారణంగా అమాంతంగా డబ్బు వొచ్చిందంటే, దాన్ని దాచుకోగలిగినవాడే ఘనుడు. అలా దాచుకోగలిగినవాడు చాలామంది వ్యక్తులు కనబరచే 'అసూయ'కు గురైనా ఫరవాలేదు అది ఎల్లకాలమూ నిలిచేదిగాదు. డబ్బుండగానే ఊళ్లో తాశీలు కట్టే పనిలేనివాళ్లూ,పొలాన మాగులుచేసే పనిలేనివాళ్లూ చాలామంది చేరతారు. వాళ్లనికాదని పోవటమే మన పని.' అరచేతిలో స్వర్గం చూపిస్తారు. దానికి అలవాటుపడకండా వుండటమే తెలివైన పని అని అన్నాడు వెంకట్రామయ్య మొదట్లో, వెంకటేశ్వర్లుకి ఆస్తి వొచ్చినప్పుడే.

ఆ మాటలు అక్కరకు రాలేదని ఇప్పటికీ విచారిస్తానే వుంటాడు వెంకట్రామయ్య.

## 2

'నన్ను కొట్టండి, చంపండి - నరకండి! ఏమన్నా చేయండి, ఈ విషయంలో మీ మాట నేను వినను. మీరు కుటుంబాన్ని నాశనం చేశారు. చేయబోతున్నారు. ఇప్పటికే వూళ్లో ఎంతమంది నోళ్ళల్లోనో మన చరిత్ర తిరుగుతున్నది! ఎంత అప్రదిష్ఠ? నిక్షేపంలాంటి పొలాన్నంతా మీ తిరుగుళ్లకూ, విలాసాలకూ వ్యయం చేశారు? ఎన్నడైనా ఆలోచించారా? 'ఇదంతా ఖర్చుపెడుతున్నాను? ఎందుకు? ఎవరి సౌఖ్యంకొరకు? తక్కిన వాళ్లు ఏమవుతారు?' అని? పోనీ. ఆ ఆలోచన మీకు రాకపోతే, నేను చెప్పలేదా? మీ అన్నగారు చెప్పలేదా? పిల్లలకు చెప్పి, బోధచేశామే! కాని మీరు చెవిని పెట్టారా?'

వెంకటేశ్వర్లు భార్య అంటున్నది, వెంకటేశ్వర్లతో.

'ఛట్! ఈ వేదాంతమంతా నాకక్కర్లేదు చెప్పు! ఏదో ఒకాటి తేల్చు, లేకపోతే చంపేస్తాను, నాకోపం అటువంటిది!' వెంకటేశ్వర్లు అరుస్తున్నాడు.

'ఆపైన ఏమైనా చేయండి!' వెంకటేశ్వర్లుభార్య గట్టిగా అంటున్నది 'దీంట్లో నేను సౌఖ్యపడేది ఏమీ లేదు. పదమూడేళ్ల పిల్ల వున్నది. రేపు పెళ్లి చేయాలి? ఎవడు పెళ్లాడటానికి ముందంజ వేస్తాడు? ఆస్తి లేకపోతే? కట్నం ఇవ్వకపోతే? మీపాలం ఎలాగూ నాశనం చేశారు! నన్ను కొట్టి, తిట్టి, బెదిరించి ఇంట్లో వున్న మూడువేల రూపాయల నగలూ ఉంపుడుగత్తెల పాలుచేశారు. ఇంకా అంతటితో తృప్తిపొందక నాపేర వున్న పొలం అమ్మి డబ్బు వొప్పజెప్పమంటున్నారు. ఇది జరగదు. నేను బ్రతికి వుండగా ఆపని చేయను, చేయలేను. పిల్లగొంతు కోయలేను.'

'ఇదంతా నీ సొంత వుపన్యాసమేనా? మా అన్నయ్య నూరిపోసిందా?' వెంకటేశ్వర్లకు అనుమానం.

స్త్రీలకు స్వంతంగా ఆలోచించే శక్తి వుండదు వాళ్లు ఎప్పుడూ భర్తలమీద, వారి ఆశయాలమీద, అభిప్రాయాలమీద ఆధారపడి వుండవలిసిందే. భర్త ఎంతచెపితే అంత తప్ప మిగిలిన ప్రపంచం వాళ్లకనవసరం. ఒకచెంపన భర్త తిరుగుబోతువాడై ఆస్తిని నాశనం చేస్తూంటే ఏడవటమే వాళ్ళపని - అనే అభిప్రాయాలుగల పురుషుల్లో వెంకటేశ్వర్లు ఒకడూకావడంమూలాన, తన భార్యకు స్వతహాగా ఇలా ధిక్కరించే బుద్ధి పుట్టదు, ఇక పోతే, తన అన్నయ్యే ఆ పని చేసివుంటాడు అనే అనుమానం బలంగా పాతుకుపోయింది.

'ఒకళ్లు చెప్పే దేమిటండీ, మన సంసారం! - మీ కేమన్నా ఇల్లు, డబ్బు, ఆస్తి, కుటుంబం, గౌరవం, ప్రతిష్ఠ - వీటి విలువలు తెలీకపోతూండె! ఒక ప్రక్కన భర్త ఎంగకూ పనికిరానివాడై పోతూంటె,

లోకంచాత నిందింపబడుతూంటే, ఏ భార్య సహిస్తుందండి!'

వెంకటేశ్వర్లు భార్యకి రోషం హెచ్చింది.

'మీవల్ల నేనేం ఆనందం పొందలేదు. నా జీవితమేమీ మీ చేతుల్లో సుఖం పొందలేదు. ఎప్పుడూ మీ గురించీ, మీ తిరుగుళ్ళను గురించీ దిగులే, మిమ్మల్ని సక్రమ మార్గంలోకి తేలేకపోతున్నాననే చింతే దాదాపు మీ అన్నయ్యగారికీ ఇదే! వెనక్కు తిరిగి చూడండి, అసలు మీకు ఆదిలో వున్నది ఎంత ఆస్తి? ఇప్పుడున్నది ఎంత ఆస్తి? ఇదంతా యేమయింది, ఇంత తొ్రబాటుకి కారకు లెవరు? అని మీకు మీరుగా ప్రశ్నించుకు చూడండి, అప్పటికైనా గమనించుకోగలుగుతారేమో!

'పైగా నా పేరున వున్న ఆస్తి అమ్మి డబ్బుచేసి ఇవ్వమంటున్నారు; మీ విలాసాలకు ఆహుతిచేయడానికి. పిల్ల స్థితి ఆలోచించారా? అందులో మనపిల్ల రంభ కాదు, మేనక కాదు, అందాన్ని చూసి చేసుకోవడానికి. ఎంత కట్నం ఇచ్చింఛితే వరుడు ముందుకు వస్తాడో ఊహించండి, ఈ రోజుల్లో! మన బ్రతుకు ఎలానూ ఇలా తెల్లవారుతూనే వున్నది. దాన్నన్నా కొస్త మంచివాడికిచ్చి సుఖపెట్టితే, అదన్నా బాగుపడుతుంది.'

ఏమనుకున్నాడో యేమో వెంకటేశ్వర్లు చరచరా బజారు కెళ్ళాడు. దిగులుపడి నిలుచుని చూస్తున్నది, వెంకటేశ్వర్ల భార్య.

మధ్యతరగతి కుటుంబాల్లోని చెడుని సంఘం త్వరగా ఆకర్షిస్తుంది. ఒక వ్యక్తి వల్ల, ఆ వ్యక్తి మనస్తత్వంవల్ల, ప్రవర్తనవల్ల ఒక కుటుంబం మలినమైతే - ఆ మలినాన్ని అందరూ కొండంతలుగా చెప్పుకొని నీతితో, ధర్మంతో కొలుచుకొని, ఆ కొలత బద్దల ప్రమాణంతో - ఆ కుటుంబాన్ని వేరుగా చూస్తుంది సమాజం! ఆ కుటుంబంలోని మనుష్యుల భవిష్యత్తుకు అది ఒక మచ్చగా పరిణమిస్తుంది.

ఇదేగనుక పుష్కలంగా డబ్బువున్నవాడు చేస్తే, భార్యను కొడుతూంటే, పరస్త్రీల సాహచర్యానికి అలవాటుబడి చెడిపోతూంటే - వాణ్ణి వేలెత్తి చూపించదు సంఘం! వాడి జీవితం బజారుపాలు గాదు, నలుగురు కళ్ళల్లో పడదు. ఎక్కడ వుంది ఆ కీలకం?

ఆ రోజు రాత్రి వెంకటేశ్వర్లు ఇంటికి రాలేదు. భార్య వొస్తాడని రాత్రి తలుపు తెరిచే అట్టేపెట్టింది. కాని రాలేదు.

మరునాడు అన్నం తిన్నాక వెంకట్రామయ్య వొచ్చాడు వెంకటేశ్వర్ల ఇంటికి. వెంకటేశ్వర్లు లేడు. వెంకటేశ్వర్ల భార్య పక్కలేని కుక్కిమంచంమీద పండుకొని ఆలోచిస్తున్నది. కంటివెంట నీళ్లు కూడా కారుతున్నవి.

'వెంకటేశ్వర్లు లేడట్లుందే?' వెంకట్రామయ్య ద్వారంలో వుండి అన్నాడు.

గబగబా లేచి, పైటచెంగుతో కళ్లు వొత్తుకుంటూ——

'లేరండీ!' అన్నది.

'రాత్రి రాలేదా?' అన్నాడు వెంకట్రామయ్య.

'రాలేదండి?' అన్నది వెంకటేశ్వర్ల భార్య.

'ఇక మనం ఏమనుకొని ఏం చేయగలం? నువ్వు ఏకధారగా యేడ్చీ లాభంలేదు. నేను దుఃఖించీ లాభంలేదు. అయితే నీ పొలం బేరం పెడుతున్నాడటగా? రాత్రి రామచంద్రయ్య చెప్పాడు. ఆయన్ని తీసుకోమన్నాడట. నువ్వేమన్నా పొలం యిస్తానని ఒప్పుకొన్నావా?'

వెంకటేశ్వర్ల భార్యకు అయోమయంగా తోచింది. పొలం అమ్మి డబ్బు ఇవ్వమనైతే అన్నారు గాని ఇలా బేరం పెట్టేటతన దగ్గరకు వొచ్చారని తెలీదు.

'నేనెందుకు యిస్తానండీ, నిన్న ప్రొద్దున ఇవ్వమనే రాయిగుద్ది కూర్చున్నారు. ససేమిరా నాగొంతులో ప్రాణం వున్నంతవరకూ నేనా పని చేయనని ఖచ్చితంగా ఒకటికి నాలుగుసార్లు చెప్పాను. ఏమనుకొన్నారో యేమో మాట్లాడకండా వెళ్లారు. మీకేమో పొలాన్నంతా నాశనం చేశారు. పెళ్లీడుకు ఎదిగివొచ్చిన పిల్ల వున్నది. దానికి రేపో మాపో పెళ్ళి చేయాలి. కట్నం యివ్వంది ఏ వరుడూ ముందరకు రాడు, అని గూడా చెప్పాను. 'ఏమైనా కానీండి, ముందరగా పెళ్లి చేసేస్తే మన బాధ్యత తీరిపోతుంది. వారి కేమన్నా పిల్లపెళ్ళివూసే లేదన్న సంగతి తెలుసుగా! మీరే ఇతకండి కొస్త మంచి సంబంధం-' అన్నది వెంకటేశ్వర్ల భార్య.

సరేనని వెళ్లాడు వెంకట్రామయ్య.

ఏమాటకామాటకు, వెంకట్రామయ్య



1 తులము టిన్నులలో అన్నిచోట్ల దొరకును.
శ్రీ అంబాళ్ అండు కంపెని,
తపాలుపెట్టె నెం. 8, మదరాసు.

చాలా సౌమ్యుడు. తమ్ముడ్ని గురించి ఆయన కున్న విచారంలో, ఊళ్లో అప్రదిష్ఠ పాలవుతున్నాడే, తన వంశంలో తన తమ్ముడుగా జన్మించి - అన్న దిగులు అంతా యింతా కాదు. ఆయన తమ్ముడుతో లోకం సంగతీ, డబ్బు సంగతీ గౌరవం సంగతీ చెబుతూ, సన్మార్గంలోకి తేవాలని నిరంతరం కృషి చేస్తూన్న మాట వాస్తవమే. అది సోదర ప్రేమ కానీండి, మరే ప్రేమన్నా కానీండి! తనలోవాళ్లు, తనకి మరింత దగ్గరవాళ్లు, చెడుమార్గాన, విలాసాలకు అలవాటుపడి అగౌరవం పొందుతూంటే - తను చూస్తో వూరుకోవడమా ? అనే మనస్తత్వం గల మనిషి నిజానికి వెంకట్రామయ్య.

## 3

ఎక్కడో, ఎవరో ముసలివాడు చస్తే, వెంకట్రామయ్య దినానికని వెళ్లాడు, ఆవూరు. చాలామంది కొస్త ధనికులనుకొన్నవాళ్లకూ వెంకట్రామయ్యకూ బాగా పరిచయం వుండటంచూలాన ఒక స్నేహితుడు రాత్రి పండుకోవటానికి తీసుకు వెళ్లాడు, తనయింటికి.

అతనికి వెంకట్రామయ్య అంటే అభిమానమే కాకుండా ఇష్టంకూడాను. చిన్నప్పుడు కలిసి చదువుకున్నారట.

మాటల సందర్భంలో తనకు పెళ్లీడు కొచ్చిన కొడుకు ఒకడు వున్నాడనిన్నీ, ఎక్కడేనా మంచిపిల్ల వుంటే చూసిపెట్టమనిన్నీ అన్నాడు, అతను వెంకట్రామయ్యతో అతను బాగా వున్నవాడు కాకపోయినా మంచివాడు. పదెకరాల మాగాణి. ఒక పెద్ద దొడ్డి. ఒకడే పిల్లవాడు. వెంకట్రామయ్య ఆలోచించాడు. ఈ సంబంధం వెంకటేశ్వర్లు కూతురు కైతే బాగుంటుం దనిపించింది.

'ఒక సంబంధం వుంది. మా తమ్ముడి కూతురు. నీకూ, నీకొడుక్కూ నచ్చితే'... నీళ్లు నమిలాడు, వెంకట్రామయ్య.

వెంకట్రామయ్యకు ఒక తమ్ముడు వున్నాడని తెలుసుగాని అతనికి ఒక కూతురు వున్నదనీ ఆ కూతురు సంబంధంకోసం వెతకాల్సిన బాధ్యత వెంకట్రామయ్య భుజాల మీద పడివుందనీ తెలీదు అతనికి.

'' ఇంకేం. ' అన్నాడతను.

'వ కొ' కును చూపించాడు. అడో అతని. ంకట్రామయ్యకు నచ్చాడు. పిల్లవాడిలో వోడు ఏమీ కనపడ్లేదు. అంత మరీ ఎత్తూ కాదూ, పొట్టీ కాదు. మధ్యస్థంగా వుంటాడు. ముఖానికి సరిపడ్డ ముక్కు. నాజూకైన పెదాలు. కలలు కనే కళ్లు అన ముకొని ఆలోచించే కళ్లు. పచ్చటి శరీరం.

ఇదంతా నచ్చిందికాని పిల్లవాడి చదువువిషయంలో వెంకట్రామయ్యకు అనుమానం వేసింది. తన స్నేహితుడుకీ చదువుమీద ఆశే యిష్టమున్నట్టు కనబడదు. అంచాత కొడుకుకుగూడ చదువు చెప్పించాడో లేవో అని. అనుమానం తీర్చుకోగలందులకు అడుగుదామనిఅనుకొంటూండగానే, అతనే అన్నాడు. మాటమీద మాటవొచ్చి--

'మావాడు స్కూలుఫైనలువరకు చదువుకొన్నాడు. ఆపైన నేనే వద్దన్నాను. ఎటుగూడీ ఉద్యోగంచేసి జీవించాల్సిన గతిలేదుగనుక అని.'

ఇంకా ఎందుకని ఆలస్యం చేయాలో, ఇంకా ఏమేమి నచ్చాలో తెలీ లేదు వెంకట్రామయ్యకు. అంటే పూర్తిగా నచ్చింది, త్వరగా పెళ్లిచేయటం ఎంతైనా శ్రేయస్కరం అని.

వెళుతూ వెళుతూ 'వచ్చే శుక్రవారంనాడు పిల్లను చూడటానికి రండి. ఆపైన మగో మంచిరోజు చూసుకొని ముహూర్తం నిర్ణయించుకోవచ్చు. మీ పిల్లవాణ్ని మేం చూసినట్లే. అందులో మళ్లా చూడాల్సిన పనిలేదు. ఇకమీరు మాపిల్లను చూసి నచ్చటమే కావాల్సింది' అని వొచ్చేశాడు, వెంకట్రామయ్య పరమ సంతోషంతో.

ఈ సంగతి వెంకటేశ్వర్లు భార్యతో చెప్పాడు. ఆమె మరీ సంతోషించింది.

'మనంమటుకు ఎన్నాళ్లని వెతుకుతాం? వెదికినా ఇంతకంటె మంచి సంబంధం దొరకబోయిందా? పిల్లవాడుగూడా చాలా మంచివాడు. స్కూలు ఫైనలువరకూ చదువుకొన్నాడుట. అంతవరకు చాలు. పిల్లవాడి తండ్రి నాకు బాగా తెలిసినవాడు గాబట్టి, కట్నం విషయంలో ఏదో ఒహటి సర్దొచ్చు. మనంగూడా అంత మరీ ఎక్కువ ఇవ్వలేముగా. అప్పటికి మావాడి బుద్ధి సరిగ్గా వుండి, పెళ్లికి వొప్పుకుంటే - అది బాగుపడిపోతుంది ఈరాత్రి వస్తే నువ్వు ఈ సంగతి చెప్పు. అసలు నేనే చెబుతాలే కనబడితే, అనిగూడా అన్నాడు వెంకట్రామయ్య.

'అడుగుతాలెండి, వారు మట్టుకు కాదంటారా?' అని అన్నది వెంకటేశ్వర్ల భార్య. ఎటుతిరిగీ వారి కేమన్నా పెళ్ళిని గురించి ఆలోచనే లేకపోయె, ఇక తాము చేస్తామంటే ఎలాగో ఓలాగున వొదిలిపోయిందని సంతోషపడతారుగాని, ఒప్పుకోక ఏం చేస్తారు అనే వూహాగూడా పోయింది వెంకటేశ్వర్లు భార్యకి.

రాత్రి పదకొండుగంట లైంతరువాత యింటి కొచ్చాడు, వెంకటేశ్వర్లు. మనిషి మనిషితీరులో లేడు. కళ్లు ఎర్రగా చింత నిప్పుల్లాగ వెలుగుతున్నయ్. గుడ్డలన్నీ మాసి వున్నయ్. అయిదు రోజుల్నాడు ప్రొద్దున పోవడం, ఇప్పుడు రావడం.

వెంకటేశ్వర్లు భార్య నిద్రకళ్లు తుడుచుకొంటూ, ఆవలించి - పెరట్లో కెళ్లి చెంబుతో నీళ్లు ముంచుకొచ్చి యిచ్చి, 'అన్నం తింటారా?' అన్నది.

మాట్లాడలేదు వెంకటేశ్వర్లు.

మళ్లా అన్నది వెంకటేశ్వర్లు భార్య, అలా అడగడం తన నిత్యధర్మమైనట్టు.

'వద్దు' అని కాళ్లు కడుక్కోకుండానే మంచంమీద పండుకున్నాడు, వెంకటేశ్వర్లు.

'ముందర కాళ్లు కడుక్కోండి, తరువాత పండుకొందురుగాని' అన్నది వెంకటేశ్వర్లు భార్య.

వెంకటేశ్వర్లు మాట్లాడలేదు. కొంచం సేపు ఎవరూ మాట్లాడలేదు.

తరువాత అన్నాడు గంభీరంగా వెంకటేశ్వర్లు - 'అయితే పొలం అమ్మవా?'

పక్క సర్దుకొంటూ 'మీ కింకా ఆ పిచ్చి ఉద్దేశ్యం పోలేదా?' అన్నది

వెంకటేశ్వర్లు మాట్లాడలేదు.

'మీ అన్నయ్యగారు అమ్మాయికి పెళ్లి సంబంధం మాట్లాడారు. పిల్లవాడు మంచివాడట. పదెకరాలున్నవాడట. స్కూలు

(38-వ పేజీ చూడండి)


## రు. 100 బహుమానం

(గవర్నమెంటు రిజిస్టరు)

**తెల్లవెంట్రుకలను అంత మొందించండి. రంగులు వాడకండి. మా ఆయుర్వేద సువాసన "సెంట్రల్ మోహిని ఆయిల్" 60 ఏళ్లదాకా నల్లగా ఉంచును ఇది మీ దృష్టిని వృద్ధిపరచి తల నొప్పిని కుదుర్చుతుంది. కొన్ని వెంట్రుకలు తెల్లబడితే రూ. 2-8-0 తో ఒక సీసా (మూడు ఒకసారి 6-8-0) కొనండి. హెచ్చుగ తెల్లబడితే 3-8-0 (మూడు ఒకసారి 9-0-0.) తలంతా తెల్లబడితే రు. 5-0-0 (మూడు ఒకసారి రు. 12) కొనండి. ఇది అబద్ధమని ఋజువుచేసిన వారికి రు. 100 బహుమానం. పూర్ణ విశ్వాసానికి అణాస్నర స్టాంపు పంపి గ్యారంటీ తీసుకొనండి.**

**Bharat Kalyan Aushadhalaya.**

Post Bag No 6725. Calcutta (A-P)

# చెల్లని నోటు

(15-వ పేజీ తరువాయి)

ఫైనలువరకు చదువుకున్నాడట. అమ్మాయి గూడా వొప్పుకుంది. మీ రేమంటారు?'

వెంకటేశ్వర్లు మాట్లాడలేదు.

వెంకటేశ్వర్లు భార్య చెప్పుకుపోతూనే వున్నది. 'మీ కేమన్నా దాని పెళ్ళిధ్యాస లేకపోయె, నే చెప్పగా మీ అన్నగారే చాలా సంబంధాలు చూశారు. చివరికి యిది నచ్చిందట. వొచ్చి నాకు చెప్పారు. కట్నం గూడా తక్కువలోనే అయ్యేటట్టు చూస్తామన్నారు. ఇందులో మీ ఉద్దేశ్య మేమిటి?' జవాబుకోసం ఎదురుచూస్తున్నది.

'ఇదంతా నాకు తెలీదు. ముందర నా విషయం తేల్చు. పొలం బేరం యిచ్చాను. అమ్మి, డబ్బుయివ్వు. లేకపోతే ఎక్కడైనా అప్పుతెచ్చి రెండువేల రూపాయలు యివ్వు.' యిం కేమేమో అరుస్తున్నాడు, వెంకటేశ్వర్లు.

వెంకటేశ్వర్లుభార్య నిలువునా క్రుంగిపోయింది. కథ అడ్డం తిరిగింది. ఎలాగో నానాఅవస్థలూపడి పిల్లకి పెళ్ళిచేయదలుచుకొంటే, దాని కేమన్నా తన భర్తగారు ఏమీ ప్రోత్సాహసోత్సాహా లివ్వకపోగా, తామే వరుడుకోసం అన్వేషించాల్సింది పోయింది. పెళ్ళి ఎలాగో ఓలాగు చెడగొట్టాలనే చూస్తున్నారు. ఎలా చచ్చేది?

'ముందర పిల్ల పెళ్ళి కానీయండి, తరువాత ఆలోచిద్దాం!

'ముందర ఈసంగతి కానీ, తరువాత ఆపెళ్ళిసంగతి ఆలోచిద్దాం!

ఇక అటువంటి భర్తతో, కన్నందుకు పెళ్లిచేసి మంచిపిల్లవాడి చేతిలో పెట్టి తన విధ్యుక్తధర్మం నెరవేర్చుకోవలసింది పోయి, తన విలాసాలకు ఆ పిల్లభవిష్యత్తును భస్మీపటలం చేయడం - ఏ కన్నతండ్రీ అంగీకరించడు. కాని వెంకటేశ్వర్లు కోరుతున్నాడు. ఇక ఆయనతో మాట్లాడి లాభం లేదని వూరుకుంది.

తెల్లవారి వెంకట్రామయ్య అన్నాడు.

'ఏరా! ఇదంతా మాకోసం, మాస్వార్థంకోసం అనే అనుకొంటున్నావా? ఒరిది. - దీంట్లో మేము బాగుపడే దేమీ లేదు. అంతా నీబాగుకోసమే! పిల్లను కన్నావు, దాన్ని పెంచి పెద్దదాన్ని చేసి ఎవరికో మంచివాడికి యివ్వటంవరకు తండ్రియొక్క బాధ్యత. ఆ బాధ్యత నేమన్నా నీవు నిర్వర్తించకపోగా విఘాతం కల్పించాలని చూస్తుంటివి. ఇది ఆడపిల్లలను కన్నతండ్రులు చేయవలసిన పనేనట్రా? నీవుగా, నీ కూతురుకు పెళ్లిచేయవని, చేయలేవని తెలుసుకున్నప్పుడు మే మన్నా ఆపనిచేసి, దాని భావి కాపాడటమే కాకుండా, వూళ్ళోవాళ్ల అపవాదునుంచి తప్పించుకోవటం, నీకు అన్యాయంగా కనిపిస్తున్నదా?'

వెంకటేశ్వర్లు మాట్లాడలేదు. మెదలకండా వూరుకున్నాడు. ఆఖరికి అన్నాడు, వెంకట్రామయ్య.

'మంచి సంబంధాన్ని యేరి, కోరి తీసుకువొచ్చాను. అంగీకరించు. ఇంతకంటె మంచి సంబంధం తేలేనప్పుడు, ఆ మంచి సంబంధాన్నే ఒప్పుకోక మనం చేసే దేమిటి?'

శుక్రవారం వొచ్చింది. వాళ్లు వొచ్చారు; పిల్లవాడి తండ్రీ, మామా, ఇంకోవూళ్లో మనిషీ. వీళ్ళని బజార్లో చూసి వెంకట్రామయ్య, కబురు చెబుతూ తీసుకువొచ్చాడు, వెంకటేశ్వర్ల యింటికి.

బయట వరండాలో నిలబెట్టి లోనకు వెళ్ళాడు వెంకట్రామయ్య, వొచ్చినవాళ్లకి మర్యాద చేయాలని-పిల్ల ముస్తాబై వున్నదో లేదో చూద్దామని.

లోన వెంకటేశ్వర్లు బిగ్గరగా అరుస్తున్నాడు. వెంకట్రామయ్య అదిరిపోయాడు.

'చెప్పు, ముందర ఈ సంగతి చెప్పు. పెళ్లి తరువాత. పొలం అమ్ముతావా? లేదా? లేకపోతే చంపేస్తాను, నిలువునా నరికేస్తాను. నా సంగతి తెలీదేమో నీకు!'

వెంకట్రామయ్య ద్వారంలోనే నిలుచుండిపోయాడు, నిలువునా నీరై.

వెంకటేశ్వర్ల భార్య యేడుస్తున్నది సన్నగా!

వొచ్చిన చుట్టాలకు అమర్యాద - అవమానం భరించలేకపోతున్నాడు వెంకట్రామయ్య. ఇంతాచేసి యిక్కడికి పెళ్ళిచూపులకు తీసుకువొస్తే...ఇక్కడ ఈ రభస!

వెంకట్రామయ్య బయటికి వొచ్చి తలకాయ వొంచుకున్నాడు. పాపం పెద్దవాడు, మర్యాదస్తుడు.

'అత నేనా మీ తమ్ముడు?' అని ఎవరో అన్నారు. వెంకట్రామయ్య పొందిన అవమానానికి అంతులేదు.

లోన వెంకటేశ్వర్లు పెద్దగా అరుస్తున్నాడు -

'చెప్పు, పొలం యిస్తావా? ఇవ్వవా? లేకపోతే చంపేస్తాను! నరికేస్తాను!- ★



మనేజింగ్ ఏజంట్లు : మౌంట్ ఫార్మసీ లిమిటెడ్, మౌంటురోడ్డు, మద్రాసు-2.
M. S. 4.